కథ

# శరతు

కె.కె. భాగ్యశ్రీ

**"మెనీ మెనీ హ్యాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే" కోరస్‌గా అంటూ శారద, సత్యమూర్తిల చేతుల్లో పుష్పగుచ్ఛాన్ని ఉంచారు వారి పిల్లలు. "థాంక్యూ మై చిల్డ్రన్" వారి అభిమానానికి గుండెల్లోని తడి కన్నుల్లోకి వచ్చి చేరింది.**

చిరు మందహాసం చేస్తూ సంతోష్, సంగీత్, స్వప్నలను దగ్గరగా తీసుకొని వారి తలలు నిమిరింది శారద ఆప్యాయంగా.

''నాన్నా అమ్మా..ఇవాళ మీ జీవితంలో మరచిపోలేని మంచిరోజు. కాబట్టి కలకాలం గుర్తుండిపోయేలా సెలబ్రేట్ చేసుకోండి'' చెప్పాడు సంతోష్.

''మీరు పెళ్లిళ్లు చేసుకొని ఉంటే తాతయ్య, నాన్నమ్మలయ్యేవాళ్లం ఈపాటికి. ఇప్పుడు మాకు సెలబ్రేషన్ ఏమిట్రా'' తప్పించుకోజూశాడు సత్యమూర్తి.

కానీ పిల్లలు పట్టుబట్టడంతో తప్పలేదతనికి. అతడి అవస్థకు శారద ముసిముసిగా నవ్వుకుంది. తల్లిదండ్రులకు వివాహ రజతోత్సవ కానుకగా పట్టుబట్టలు, బంగారు ఉంగరాలు అందించారు పిల్లలు.

నూతన వస్త్రాలను ధరించి, దేవుడి గదిలోకి వెళ్లి భక్తిగా నమస్కరించారు ఇద్దరూ. అనంతరం కదలలేని స్థితిలో మంచం మీదున్న సత్యమూర్తి తల్లి నరసమ్మకి పాదాభివందనం చేశారు.

''దీర్ఘాయుష్మాన్ భవ ఐశ్వర్యాభివృద్ధి రస్తు'' తడబడుతున్న కంఠంతో దీవించిందా వృద్ధురాలు.

ఇంట్లో సంబరం పూర్తయ్యాక దంపతులిద్దరూ కలిసి గుడికి బయలుదేరారు.

గుడిలో శ్రీరామచంద్రుకి అభిషేకం, అర్చన జరిపించుకున్నాక ప్రశాంతమైన గుడి ఆవరణలో హాయిగా కాస్సేపు కూర్చోవాలని అనిపించింది వారికి.

గుడి వెనుక భాగంలో పూల మొక్కలు వున్న చోట విశ్రాంతిగా కూర్చున్నారు.

తలవంచుకొని కొబ్బరి చిప్పను గచ్చుకేసి కొడుతున్న శారదవైపు తదేకంగా చూశాడు సత్యమూర్తి.

అక్కడక్కడ నెరిసి జరీపోగుల్లా కనబడుతున్న తలవెంట్రుకలు, నుదుట అరుణారుణ సూర్య బింబంలా వెలిగిపోతున్న ఎర్రని కుంకుమ, పాపిట్లో సింధూరం..మెడలో ఆభరణాలు..వదనానికి వికాసాన్నిచ్చే చిరునవ్వు.

చెప్పుకోదగిన అందగత్తె కాని శారదలో ఆకర్షణ మాత్రం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది.

'ఆమెలో నెలకొని ఉన్న శాంత స్వభావమే ఆమెకు ఆభూషణమై ఉండవచ్చు' అనుకున్నాడు సత్యమూర్తి.

శారదతో కలిసి తన బ్రతుకు ప్రయాణం ప్రారంభించి నేటికి పాతిక సంవత్సరాలు నిండాయి.

'ఈ పాతిక సంవత్సరాలలో..ఏనాడూ..ఏ సందర్భంలోనూ తనని కష్టపెట్టే పని చేయలేదు శారద. కానీ..పెళ్లికి ముందు మాత్రం!'

''ఏమిటీ..గుళ్లోకి వచ్చినా ఆ పరధ్యాన్నం?'' కొబ్బరి చిప్ప పగులగొట్టి ఆ ముక్కను చేతికి అందిస్తూ అడిగింది శారద.

ఉలిక్కిపడి ''అహ..ఏం లేదు'' అంటూ ఆ ముక్కను అందుకున్నాడు సత్యమూర్తి.

కొబ్బరిముక్కను కళ్లకద్దుకొని నోట్లో వేసుకుని భార్యవైపు చూశాడు.

శారద ముఖంలో అంతులేని సంతృప్తి..కళ్లల్లో స్వచ్ఛత..నిర్మలత్వం గోచరిస్తున్నాయి.

ఈమె తోడులేకుంటే తాను ఈ సంసారాన్ని సజావుగా సాగించగలిగే వాడా! శారదను వివాహమాడేసరికి తానున్న పరిస్థితి ఎటువంటిది? తన జీవితంలోకి అడుగుపెట్టి ఎంతో వివేకంతో, విచక్షణతో మెలిగి పిల్లలను పెంచి పెద్ద జేయడమే కాకుండా తన కన్న తండ్రి కాలం కూడా వెళ్లబుచ్చింది. మంచంలో పడి ఉన్న తల్లికి సకల సపర్యలు చేస్తోంది. ఇంతటి సంయమనం కలిగిన శారద...పెళ్లికి ముందు అలా ఎందుకు ప్రవర్తించినట్లు. అర్థరహితంగా అలాంటి షరతు ఎందుకు విధించినట్లు?

ఆలోచనలలో ఉక్కిరిబిక్కిరి అవసాగాడు సత్యమూర్తి.

''ఏమండీ..ఇందాకటినుండీ ఏదో లోకంలో ఉన్నారు'' పట్టి కుదిపింది శారద.

ఆమెనే కన్నార్పకుండా చూస్తూ ''శారదా...నిన్నొక విషయం అడుగుతాను. నిజానికి ఈ విషయమై నిలదీయవద్దని నువ్వు నా దగ్గర వాగ్దానం తీసుకున్నావు. మన పెళ్లయ్యి ఇరవై అయిదేళ్లయినా ఈ రహస్యం రహస్యంగానే మిగిలిపోయింది. భార్యాభర్తల మధ్య ఏ దాపరికాలు ఉండకూడదంటారు. అందుకే అడుగుతున్నాను. ఇప్పటికైనా చెప్పు..ఆరోజు..మన పెళ్లిచూపులనాడు నువ్వలాంటి కోరిక ఎందుకు కోరావు'' అడిగేశాడు సత్యమూర్తి.

అయితే...అతడూహించినట్లుగా శారద ముఖకవళికల్లో ఏ మార్పూ లేదు.

వదనంలో అదే ప్రశాంతత.

పెదవులు విడివడకుండా నవ్వి ''చెప్పి తీరాలంటారా'' అడిగింది శారద.

''ఆ..తప్పనిసరిగా..ఇది మన పెళ్లిరోజు సందర్భంగా నువ్విచ్చే కానుకనుకుంటాను'' అన్నాడు సత్యమూర్తి.

''మన పెళ్లిచూపుల తతంగం మీకు గుర్తుండే ఉంటుంది'' ఉపోద్ఘాతంలా అంది శారద.

ఎందుకుండదు? నడిసముద్రంలో నావలా, నిస్సహాయస్థితిలో అల్లల్లాడుతున్న తన జీవితం మలుపు తిరిగిందానాడే..

సత్యమూర్తి కళ్లముందు గత జ్ఞాపకాలు ప్రత్యక్షమయినాయి.

★ ★ ★

''నా మాట వినరా మూర్తీ..ఎంతకాలం ఇలా ఒంటి బ్రతుకు బ్రతుకుతావు? సునందపోయి అప్పుడే రెండేళ్లయిపోయింది. పిల్లలిద్దర్నీ సాకలేక నానా అవస్థ పడుతున్నావు. అమ్మకా ఓపిక ఉడిగిపోతోంది. ఇక మీ అన్నా వదినలంటావా...ఎవరి బాధలు వారివి. పేరుకి ఉమ్మడి కుటుంబమన్నమాటేగాని ఒకరి గోడొకరికి పట్టదు. అందుకే చెప్తున్నాను. నువ్వు మళ్లీ పెళ్లి చేసుకుంటేగాని పిల్లలకి మంచి జరగదు'' అరగంట నుండీ సత్యమూర్తిని ఒప్పించడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు అతడి తండ్రి కేశవరావు.

సత్యమూర్తి ఎటూ తేల్చుకోలేక సతమతమవుతున్నాడు.

అర్థాంగి సునంద చిన్నవాడి పురుట్లో అనారోగ్యానికి గురై మరణించి రెండేళ్లయ్యింది. అప్పటి నుండీ నరసమ్మే ఆ పసివాడి సంరక్షణా బాధ్యత వహించింది. ఆమెకీ శక్తి తగ్గిపోతోంది. అందుకే పునర్వివాహానికి అంగీకరించమని ఒత్తిడి చేస్తు

న్నారు వారు.

చాలాసేపు బ్రతిమాలి, ఒంటరి జీవితంలో ఉన్న సాధకబాధకాలను వివరించిన మీదట అయిష్టంగానే పెళ్లిచూపులకి ఒప్పుకున్నాడు సత్యమూర్తి.

కొడుకుని తీసుకొని దూరపు బంధువుల అమ్మాయి అయిన శారదను చూడ్డానికి వెళ్లారు కేశవరావు దంపతులు.

శారద తల్లిలేని పిల్ల. సవతి తల్లి అదుపాజ్ఞలలో, ఆంక్షలతో ఒద్దికగా పెరిగింది. అటువంటి పిల్లయితే సవతి పిల్లలను బాధ్యతగా సాకగలదని భావించి శారదను ఎంపిక చేసింది నరసమ్మ.

శారదకు అప్పటికే పాతిక పైబడ్డాయి. అన్నేళ్లు వచ్చినా పెళ్లి కాకపోవడానికి కారణం శారద సవతి తల్లే అంటారు తెలిసినవారు కొందరు. అదేమీ కాదు. ఆమె జాతకంలో ఉన్న కుజదోషం వల్లనే ఆమెకింకా పెళ్లి కాలేదని వాదిస్తుంది ఆమె సవతి తల్లి.



కుదురుగా తన ముందు కూర్చున్న శారదను చూసి తృప్తిగా నిట్టూర్చాడు సత్యమూర్తి.

పెద్ద అందగత్తె కాకపోయినా కళగల ముఖకవళికల్తో సామాన్యంగా ఉంటుంది శారద. వయసు పాతిక దాటటం మూలాన కాస్త ముదిరిపోయినట్లుగా కనిపిస్తుంది.

తనకీ పరిస్థితుల్లో కావలసినది సౌందర్యవతియైన భార్య కాదు. అణకువగా అన్నీ చక్కబెట్టుకోగలిగిన సమర్థవంతురాలైన ఇల్లాలు.

శారద, సత్యమూర్తికి నచ్చింది. ఆమెను పెళ్లి చేసుకునేందుకు తన సంసిద్ధతను వ్యక్తపరిచాడు అతడు.

''మీరు నిర్ణయం తీసుకోబోయే ముందు..నేను మీతో కొద్దిగా మాట్లాడాలి'' అంది శారద నెమ్మదిగా.

ఉలిక్కిపడింది నరసమ్మ. అప్పటికి పెళ్లిచూపుల్లో ఆడపిల్లలు నోరు తెరిచి తమ ఉద్దేశ్యాల్ని, అభిప్రాయాల్ని విశదపరిచే సదాచారం ఇంకా మొదలవలేదు.

శారద మాటలకు గుడ్లురిమి చూసింది ఆమె సవతి తల్లి. అదేమీ పట్టించుకోలేదు శారద.

ఏమనుకున్నాడో ఏమో సత్యమూర్తి ఆమెతో ఏకాంతంగా సంభాషించడానికి అంగీకరించాడు.

గదిలో కిటికీ దగ్గర నిలబడి..చువ్వలు చేత బిగించి అవతలకి చూస్తోంది శారద. తన ఉనికి తెలియపరుస్తున్నట్లుగా చిన్నగా దగ్గాడు సత్యమూర్తి. వెనుతిరిగి చూసింది ఆమె.

''చెప్పండి. ఏదో మాట్లాడాలన్నారు. నన్ను చేసుకోవడానికి మీకేమైనా అభ్యంతరమా'' అడిగాడు సత్యమూర్తి.

వెంటనే ఏమీ మాట్లాడలేదు శారద. అతడికి అభిముఖంగా తిరిగి కాలి బొటన వ్రేలితో నేలమీద ముగ్గులు వేస్తూ నిలబడింది.

''ఫరవాలేదు. మీ అభిప్రాయాన్ని నిరభ్యంతరంగా, నిర్మొహమాటంగా వెల్లడించవచ్చు. నేనేమీ అనుకోను'' అభయమిచ్చాడు సత్యమూర్తి.

బెదురుకళ్లతో అతడి వైపు చూసింది శారద.

''నేను చెప్పినది విన్నాక నన్ను అపార్థం చేసుకోకూడదు మరి!'' సంకోచిస్తూ అంది శారద.

మెత్తగా నవ్వి ''ఏమీ అనుకోనని చెప్తున్నాగా..మీ మనసులో మాట చెప్పండి'' అన్నాడు సత్యమూర్తి.

ఒక్కసారి ఊపిరిపీల్చి వదిలి ''మిమ్మల్ని చేసుకోవడం నాకిష్టమే..అయితే..'' ఆగిపోయింది శారద.

''అయితే''

''నేను మీ పిల్లల్ని స్వంత తల్లిలా ఆదరించగలను. వారికి ఏ కష్టమూ కలగకుండా చూసుకుంటానని మాట ఇస్తున్నాను. దానికోసం నేను నా మాతృత్వాన్ని మానుకొనేందుకు మాత్రం సిద్ధంగా లేను''

''అంటే'' అర్థంకాక అడిగాడు సత్యమూర్తి.

''సినిమాల్లో చూపించిన విధంగా పెళ్లికి ముందుగాని, తరువాతగాని కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకునేందుకు నేనొప్పుకోను.

నేను తల్లినయినా సరే మీ పిల్లలను నిర్లక్ష్యం చేయను'' ధైర్యం కూడదీసుకుని తన అంతరంగాన్ని అతని ముందు పరిచింది శారద.

సత్యమూర్తికి ఆమె అమాయకత్వానికి నవ్వొచ్చింది. అయినా నవ్వకుండా ''అలాగే కానీండి. మిమ్మల్ని అలా చేసి తీరాలని నేను ఆజ్ఞాపించలేదే..అయినా నిజ జీవితంలో సినిమాల్లోలా జరగదు..పెళ్లికాని అమ్మాయికి ఎవరూ కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయరు. అలా చేయడం చట్టవిరుద్ధం కూడా'' అన్నాడు.

''ఏమో..నాకవన్నీ తెలియదు. నా మనసుకి తోచింది చెప్పాను.'' సిగ్గుపడింది శారద.

''నాక్కావలసింది తల్లిని కోల్పోయిన నా బిడ్డల్ని అక్కున చేర్చుకొని ఆదరించే అమ్మాయి. అందుకోసం ఆమె తన మాతృత్వాన్ని త్యాగం చేయమని శాసించే మూర్ఖుడిని కాదు. ఇంతేనా! నాతో పెళ్లికి అంగీకరించే విషయంలో మీకింకా సందేహాలేమన్నా ఉన్నాయా?'' అడిగాడు సత్యమూర్తి.

శారద వెంటనే బదులీయలేదు. ఆమె వాలకాన్ని బట్టి ఆమె తనతో ఇంకా ఏదో చెప్పాలన్న గుంజాటనలో ఉందని అర్థమైంది సత్యమూర్తికి.

''చూడండి శారదా..వివాహసౌధం అనేది నమ్మకమనే పునాదిమీద నిలబడి ఉంది. మీరు నా పిల్లల్ని చక్కగా చూసుకుంటారని నేను నమ్ముతున్నాను. అలాగే నేనూ మీ మనసుని నొప్పించే విధంగా ప్రవర్తించనని మీరూ నమ్మాలి..పెళ్లికి ముందే ఏ అనుమానాలున్నా తీర్చుకోవటం మంచిది'' ఆమెలోని ఆందోళనను పారద్రోలే ప్రయత్నం చేశాడు.

''నేను..మీతో పెళ్లికి ఒప్పుకోవాలంటే మీరింకో షరతుకి అంగీకరించాల్సి ఉంటుంది''

''ఇంకో షరతా? అదేంటి?'' విస్మయంగా అడిగాడు సత్యమూర్తి.

''మీరు..మీరు.. మన పెళ్లవ్వగానే వేరుకాపురం పెట్టాలి. మీరు, నేను, పిల్లలు తప్ప మరెవరూ ఉండకూడదు ఆ ఇంట్లో. కావాలంటే రోజూ వెళ్లి మీ వాళ్లని చూసిరండి. వాళ్లకి కావలసినవన్నీ చేయండి. అంతేగాని..కొన్నాళ్లపాటు మనింటికి ఎవరూ రాకూడదు. పిల్లల్ని తరచు అక్కడికి పంపకూడదు'' బెరుగ్గా చెప్పినా స్థిరంగా ఉంది శారద కంఠం.

అదిరిపడ్డాడు సత్యమూర్తి. అమ్మాయిని చూడగానే శాంతమూర్తిలా అనిపించింది. పిల్లల్ని కడుపులో పెట్టుకుని చూసుకుంటానన్నప్పుడు కోరి వరాలిచ్చే దేవతలా అనిపించింది. అంతలోనే..అశనిపాతంలా ఇలాంటి షరతు విధించిందేమిటి?

ఇన్నాళ్లుగా తల్లిని పోగొట్టుకున్న తన పిల్లలను కంటికిరెప్పలా కాపాడిన తల్లిదండ్రులను విడిచి వేరుకాపురం పెట్టాలా? కంచుకోటలాంటి ఉమ్మడి కుటుంబ వ్యవస్థను వదిలి ఏకాకి బ్రతుకు బ్రతకాలా!

ఇవి చెప్పడానికేనా ఆమె ఇంతసేపూ నజ్జుగుజ్జులాడింది?

ఇప్పుడేం చేయాలి తను. పెళ్లయి కొన్నాళ్లు గడిచిన తరువాత వేరు కాపురం పెట్టమని అడిగిందంటే అర్థం ఉంది. ఇంట్లో వాళ్లతో సరిపడలేదు కాబోలు అని అనుకోవచ్చు. కానీ ఇంకా తనతో బంధం ఏర్పడక మునుపే..ఇలాంటి షరతు విధిస్తోందంటే ఏమనుకోవాలి?

ఇప్పుడే ఇలాంటి ఒప్పందాలు చేసుకోవాలని ఆలోచిస్తోందంటే రేపొద్దున్న తన పిల్లల్ని కూడా తన నుండి దూరం చేయదని గ్యారంటీ ఏంటి?

కానీ వాళ్లని బాగా చూసుకుంటానని హామీ ఇస్తోందే!

దీనిని నమ్మాలా! వద్దా?

ఎటూ తేల్చుకోలేక సతమతమయ్యాడు సత్యమూర్తి.

అతడి సందిగ్ధాన్ని గమనించినదానిలా..''మీ నిర్ణయం వెంటనే చెప్పనక్కర లేదు. నింపాదిగా ఆలోచించి చెప్పండి. ఒక్కటి మాత్రం గట్టిగా చెప్పగలను. నావలన మీ పిల్లలకు మాత్రం ఎటువంటి అన్యాయం జరగదు..ఇంకో విషయం ఇలా నేను ఎందుకు అడిగానోనని తెలుసుకునే ప్రయత్నం మీరు చేయకూడదు'' చెప్పింది శారద.


''నేను ఆలోచించుకొని..ఏ విషయం చెప్తాను'' నూతిలోంచి వచ్చినట్లుగా వినిపించింది సత్యమూర్తి గొంతు.

★ ★ ★

''వద్దమ్మా..ఈ సంబంధం మనకొద్దు. నాకో పెళ్లామూ వద్దు. నా పిల్లలకి తల్లీ అవసరం లేదు. ఎలాగో తంటాలు పడి నా పిల్లలను నేనే పెంచుకుంటాను. ఇవాళ మిమ్మల్ని వదిలేయమంది. రేపొ

## స్వరాభిషేకం

**తెలుగు ప్రేక్షకులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న మంచి సంగీత చిత్రం త్వరలో విడుదలకాబోతోంది. శ్రీకాంత్, శివాజీ, లయ, ఆముక్తమాల్యద తారాగణంగా రూపొందుతున్న కొత్త చిత్రం స్వరాభిషేకం డబ్బింగ్ పూర్తిచేసుకుంది. మంచి సంగీతంతో కూడిన పాటలు, సన్నివేశాలు, సకుటుంబంగా చూడదగిన ఈచిత్రంలో నటించడం తనకెంతో ఆనందంగా ఉందని లయ వ్యాఖ్యానించింది. కె.విశ్వనాథ్ దర్శకత్వం ఈ చిత్రానికి అదనపు ఆకర్షణ.**



ద్దున్న ఇంకేమైనా చేయమంటుంది. నా పిల్లల బాగు కోసం ఆలోచించి మీకు ద్రోహం చేయలేను'' ఆవేదనగా పలికాడు సత్యమూర్తి.

కేశవరావు, నరసమ్మలు ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. శారద గురించి తాము మంచిగానే విన్నారు. ఒద్దికగా సంసారం చేయగల సహనశీలి అని..నెమ్మదస్తురాలని తెలిసింది. ఉమ్మడి కుటుంబంలో పెరిగి అందులో కష్టనష్టాలు, సుఖదుఃఖాలను ఆకళింపు చేసుకోగలిగిన అమ్మాయి. ఇలాంటి షరతు పెట్టిందంటే అందులో ఏదో అంతరార్థం ఉండాలి. ఇలా ఆలోచించి ఎన్నో విధాల కొడుక్కి సర్దిచెప్పారు వారు.

అటు తల్లిదండ్రులు బలవంతం..ఇటు పరిస్థితుల ప్రాబల్యం కలసి సత్యమూర్తి శారదను పెళ్లాడేలా చేశాయి.

శారద కాపురానికి వచ్చింది. ఇదివరలో తామందరూ కలిసి ఉండే ఇంటికి దూరంగా ఇంకో ఇల్లు తీసుకున్నాడు సత్యమూర్తి.

మాటిచ్చిన విధంగానే ఎంతో ఓర్పుగా, నేర్పుగా వ్యవహరించి పసిపిల్లలైన సంతోష్, సంగీత్‌లను సాకి ఆ సంసారాన్ని ఓ కొలిక్కి తెచ్చింది.

అన్ని విధాల సత్యమూర్తికి తగిన ఇల్లాలనిపించుకుంది.

సంతోష్, సంగీత్‌లు పెద్దవారయ్యేసరికి ఆమెకు స్వప్న పుట్టింది.

తనలోని తల్లిప్రేమను ముగ్గురు పిల్లలకూ సరిసమానంగా పంచుతూ, వారి చేత ఆదర్శమాతృమూర్తి అనిపించుకుంది.

సత్యమూర్తి తల్లిదండ్రులిద్దరూ వృద్ధులయ్యారు. కేశవరావు పక్షవాతంతో మంచాన పడ్డాడు. అతడికి చాకిరీ చేయలేక మిగిలిన కోడళ్లు విసుక్కొనేవారు. సత్యమూర్తి వాళ్లని చూడ్డానికి ఆ ఇంటికి వెళ్లినప్పుడు తమ దుస్థితిని అతడితో చెప్పుకొని కంటతడి పెట్టేవారు వారు.

వారి పరిస్థితికి హృదయం ద్రవించిన సత్యమూర్తి, తానే విధంగానూ అండగా ఉండలేకపోయానని తల్లడిల్లిపోయి వారి అసహాయస్థితి గురించి భార్య దగ్గర వాపోయాడు ఓనాడు.

అతడి సమక్షంలో మౌనం వహించిన శారద మర్నాడు తెల్లవారుతూనే వెళ్లి అత్తమామలను ఇంటికి వెంటబెట్టుకొచ్చింది.

ఆమె చర్యకి విస్తుపోవడం సత్యమూర్తి వంతయ్యింది.

కేశవరావు జీవించి ఉన్నంతకాలమూ ఎంతో ఓపిగ్గా, స్వంత బిడ్డకన్న ఎక్కువగా అతడికి సేవ చేసింది. ఏనాడూ విసుక్కోలేదు. పన్నెత్తి ఒక్క పరుషమైన మాట అనలేదు.

మామగారి మరణానంతరం మరీ కృంగిపోయిన అత్తగారిని కూడా కంటిపాపలా కాపాడుతూ 'మా కోడలు మంచిది' అన్న పేరు సంపాదించుకుంది.

ఇంతటి దయార్ద్ర హృదయం ఉన్న ఆమె, ఆనాడు అయినవారందరినీ విడిచి తనను వేరు కాపురం పెట్టమని ఎందుకు కోరిందో అంతు చిక్కలేదు సత్యమూర్తికి.

ఎన్నోసార్లు ఈ విషయమై ఆమెను నిలదీయాలనుకొని ఆమెకిచ్చిన మాట గుర్తొచ్చి ఆగిపోయేవాడు.

కానీ ఇవాళ అసలు రహస్యం తెలుసుకోవాలని ఉద్రూతలూగుతున్న మనసుని అదుపులో పెట్టలేక అడిగేశాడు.

★ ★ ★

''ఏంటీ..ఫ్లాష్‌బ్యాకా..మన పెళ్లిచూపులు, నేను విధించిన షరతు..అన్నీ గుర్తొచ్చాయనుకుంటాను'' అడిగింది శారద భర్త వీపు మీద చేయి వేసి లాలనగా నిమురుతూ.

అవునన్నట్లుగా తలాడించాడు సత్యమూర్తి.

''ఆనాడు నేనెందుకలా చేశానో తెలుసుకోవాలనుకుంటున్నారు. అంతేగా'' గంభీరంగా అడిగింది శారద.

మళ్లీ తలాడించాడు సత్యమూర్తి.

''మీకు తెలుసు. మా పిన్ని వలన నేను ఎన్నో బాధలు పడ్డానని. అలా ఎందుకు జరిగిందో తెలుసా! ఇంట్లోని పెద్దవారి వలన''

గతుక్కుమన్నాడు సత్యమూర్తి.

ఈమె మాటలు, చేతలు అన్నీ విచిత్రంగానే ఉంటాయి. సంయమనం వహించి, సయోధ్యతో కలిసి ఉండమని హితవు పలికే పెద్దలే, విభేదాలకు కారణమవుతారా?

''మీకు నా మాటలు వింతగా తోస్తున్నాయని నాకు అర్థమైంది. మా అమ్మ పోయేసరికి నాకు పదేళ్లు, తమ్ముడికి అయిదేళ్లు. ఉమ్మడి కుటుంబం కావడం మూలాన ఇంట్లో నాన్నమ్మ, తాతయ్య, పెళ్లికాని మేనత్తలు, బాబాయిలూ, పిన్నులు అందరూ ఉండేవారు. మా ఆలన పాలన

## డ్రైవింగ్ ఓకె?

**హాస్యరసాన్ని అవలీలగా పోషించే నటికిరీటి రాజేంద్రప్రసాద్ సినిమాలంటే ఎంతో ఆసక్తి. 'అప్పారావ్ డ్రైవింగ్ స్కూల్' పేరుతో జనం ముందుకి వచ్చిన ఈ చిత్రం రాజేంద్రప్రసాద్ అభిమానుల అంచనాల్ని ఎంతమేరకు సఫలీకృతం చేస్తుందో చూడాల్సిందే. అన్నట్టు ఈ చిత్రంలో మాళవిక, ప్రీతీజింగానియా హీరోయిన్లుగా నటించారు. భార్యభర్తల మధ్య ఏర్పడే మనస్పర్థల్ని ఎలా పరిష్కరించుకోవాలనే అంశంపై రూపొందిన ఈ చిత్రం ప్రారంభంలోనే సమస్యల్లో చిక్కుకుంది. హీరో, హీరోయిన్ల మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. ఇలా ప్రారంభమైన ఈ చిత్రం జనాన్ని ఎలా మెప్పిస్తుందో చూద్దాం.**



చూడడం కోసం నాన్నకు మరొక పెళ్లి చేసుకోకతప్పింది కాదు. అంతే..ఇంట్లో పెద్దవారి పోరు ప్రారంభమయింది.

'మీ నాన్న ఇంకో పెళ్లాన్ని తెచ్చుకుంటున్నాడే..ఇక మీ బ్రతుకు కుక్క బ్రతుకే' అంటూ చెవిలో జోరీగలా శతపోరేది నాన్నమ్మ. అత్తయ్యలు సరేసరి..వచ్చే ఆవిడ మిమ్మల్ని రాచి రంపాన పెడుతుందని తెగ భయపెట్టేశారు. వచ్చే ఆవిడ ఒక దెయ్యంలాగానో, భూతంలాగానో మా మనసుల్లో ముద్రపడిపోయింది.

పిన్ని మా ఇంట్లో అడుగుపెట్టాక మా మంచి చెడ్డలు చూసే విషయంలో చొరవ తీసుకుంది. ఏదైనా పొరబాటు చేస్తే చొరవగా మందలించబోయేది.

కానీ ఆవిడ పట్ల ద్వేషభావం నిండిపోయిన మా పసి హృదయాలకి ఆ ఆప్యాయత అర్థం కాలేదు. అగ్నికి ఆజ్యం పోసినట్లుగా ఇంట్లో వారు కూడా యథాశక్తి ప్రయత్నించారు. ఆవిడ పక్షాన చేరిన మా బాబాయిల భార్యలు ఆవిడ మనసు కలుషితం చేశారు. దాన్తో ఆవిడ మా మీద శత్రుత్వం పెంచుకుంది. మా దృష్టిలో ఆవిడ మా నాన్నను మా నుండి లాగేసుకున్న రాక్షసిలా కనిపిస్తే, ఆవిడ కంటికి మేము వారి ఆనందాన్ని హరించే దొంగల్లా అనిపించేవాళ్లం.

అలా ఆవిడకు మాకు మధ్య అవగాహన లోపించింది. మా నడుమ ఎవరూ పూడ్చలేని అగాథం ఏర్పడింది. ఇదంతా, ఇంట్లో ఉన్న సభ్యుల నిర్వాకమే అని తెలుసుకునే వయసొచ్చేసరికి పరిస్థితి విషమించింది. సవితిపిల్లల్ని కాల్చుకుతినే రాక్షసిలా ఆవిడ ప్రఖ్యాతి చెందింది.

మీరు ఎంతో ఆశతో..మీ పిల్లలకు మంచి తల్లిని తేవడం కోసమే నన్ను పెళ్లి చేసుకోవడానికి మొగ్గు చూపారని తెలిశాక నేను బాగా ఆలోచించాను. గతమంతా కన్నులముందు కదిలింది. తిరిగి నా విషయంలో కూడా అదే పునరావృతమవ్వడం నాకిష్టం లేకపోయింది. మీకు, పిల్లలకి పూర్తి న్యాయం చేయాలంటే వారికి నాకు మధ్య వేరెవరూ అడ్డుగోడగా నిలవకూడదనిపించింది.

స్వంత తల్లిలా వాళ్లని హృదయానికి హత్తుకోవాలన్నా, వారు కూడని పని చేసినప్పుడు మందలించి మంచి దారిలో పెట్టాలన్నా..నాకు స్వేచ్ఛ కావాలి. ఆకలేసినప్పుడు కడుపు చూసి అన్నం పెట్టినా..అల్లరి చేసినప్పుడు కడుపునిండా చీవాట్లు పెట్టినా..అన్నింటికీ అమ్మే కావాలి అని వారి లేత మనసులకి అర్థం కావాలి.



ఇంట్లో మరొక మనిషి ఉంటే అది సాధ్యం కాదు. పిల్లల మనసులు మట్టి ముద్దల్లాంటివి. అవి ఎలా మలచితే అలా మలవబడతాయి.

వారు నేను వారి సవితి తల్లినన్న విషయం వారు పూర్తిగా మరచిపోవాలి. దానికిగాను ఎవరూ విడదీయలేనంత దగ్గిరతనం, ఆత్మీయత మా మధ్య ఏర్పడాలి.

ఇవన్నీ దృష్టిలో పెట్టుకునే ఆనాడు నేనా నిర్ణయం తీసుకున్నాను.

నా ఇంట్లో వారు అలా ప్రవర్తించారు కాబట్టి మీ వాళ్లూ అలాగే ప్రవర్తించుతారని నేనేం నిర్ధారించలేదు. కేవలం ముందు జాగ్రత్త కోసమే నేనలా చేశాను.

మీరు కూడా సహృదయతతో నా షరతుకి అంగీకరించారు. అదృష్టవశాత్తూ నేను నా ప్రయత్నంలో సఫలీకృతురాలినైనాను. నా పట్ల అవ్యాజమైన అనురాగం ఉండేలా పిల్లలతో అనుబంధం పెంచుకున్నాను.

అయితే ఈ ప్రయత్నంలో నేను నా అత్త మామలకి మిగిలిన కుటుంబ సభ్యులకి ఎంతో కొంత అన్యాయం చేసే ఉంటానన్న ఆవేదన నన్ను స్థిమితంగా ఉండనిచ్చేది కాదు.

నేను చేసిన పాపానికి పరిహారంగా వృద్ధాశ్రమంలో ఉన్న అత్తమామలకు సేవ చేశాను. ఒక కోడలిగా నా ధర్మం నేను నిర్వర్తించడానికి కాస్త సమయం తీసుకున్న మాట వాస్తవం. కానీ అది మనందరి క్షేమం కాంక్షించి చేసినదే.

ఇప్పుడు చెప్పండి. నేనీ రకమైన షరతు విధించడంలో అధర్మం ఏమైనా ఉందంటారా!''

ఇన్నాళ్ల తరువాత తన మనసు విప్పిన శారదలో చనిపోయిన తన భార్య సునంద కనిపించింది సత్యమూర్తి కన్నులకు. అతడి కళ్లు సజలమయ్యాయి. ప్రేమోద్వేగంతో కంపించిపోయాడు నిలువెల్లా. కేవలం...తన పిల్లలను సక్రమంగా పెంచడం కోసమే ఆమె అందరి దృష్టిలో చెడ్డగా మిగిలిపోయిందని తెలుసుకున్న అతడి హృదయం ఆమె పట్ల అంతులేని అనురాగంతో నిండిపోయింది.

''ఆ దేవుడి సాక్షిగా చెప్తున్నాను శారదా. జన్మజన్మలకీ నువ్వే నా అర్ధాంగి కావాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నాను'' గద్గద స్వరంతో అంటూ ఆమెను గుండెలకు హత్తుకున్నాడు సత్యమూర్తి.

## ధీమా

**'ఎప్పుడూ ఒకేలా కన్పిస్తే ఇక్కడ మనుగడ ఉండదు. సినిమా అంటే రకరకాల పాత్రలు చేయాల్సి ఉంటుంది. అందుకే నేను పరిస్థితికి తగ్గట్టుగా నా రూపాన్ని మార్చుకుంటున్నాను. ఇందులో మీరంతా అభ్యంతరపెట్టాల్సిన అంశాలేవీ లేవు' అని ఖరాఖండీగా చెబుతోంది ప్రీతీ జింగ్యానీ. హీరోయిన్ నుంచి సెక్సీబాంబ్‌గా మారిపోయిన ప్రీతీ కొత్త చిత్రం 'చహత్-ఏక్ నషా'తో జనం ముందుకి రాబోతోంది. 'మిగతా వారిలాగా బరువు సమస్యలు నాకు లేవు. నేడు ఎప్పుడు సన్నగా మారాలన్నా మారగలను. అవకాశాల్ని చేజిక్కుంచుకోగలను' అని ధీమాగా చెబుతోంది.**